క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



క్లీనర్లు, డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి వద్దనున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపోలో నారాయణ చారిటబుల్ ట్రస్టు వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఐఓసీ అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది, డ్రైవర్లు, క్లీనర్లకు బీపీ, షుగర్, కంటి పరీక్ష, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ హరీష్‌కుమార్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం కింద నెలకు రూ.29,200 చెల్లించేంత వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామని మున్సిపల్ కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్ హెచ్చరించారు. మంగళవారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి గాంధీచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్మిక కుటుంబాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేని పక్షంలో ఈ నెల 22వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ సహాయ కార్యదర్శి సురేంద్ర, నాయకులు మస్తాన్, లక్ష్మీనారాయణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



చింతలాయ పల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

యాడికి: మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తాడిపత్రి మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మలేరియా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం యాడికి వైద్యాధికారి పరమేశ్వర్ ఆధ్వర్యంలో మండలంలోని చింతలాయపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియాను అంతం చేయొచ్చన్నారు. చలి, జ్వరంతో కూడిన లక్షణాలుంటే మలేరియా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం చింతలాయ పల్లి గ్రామంలోని ఇళ్లను సర్వే చేసి, నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాంప్రసాద్‌గౌడ్, ఏఎస్ఎం జీనత్, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్త రంగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం పక్కాగా అమలుచేయాలి



ఆర్‌డీఓకు వినతి పత్రం అందజేస్తున్న న్యూ డెమోక్రసీ నాయకులు

గుంతకల్లు: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి ఆర్‌డీఓ శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలు సిండికేట్‌గా వ్యవహరిస్తూ విద్యా హక్కు చట్టాన్ని (ఆర్‌టీఈ) నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఆర్‌టీఈ ద్వారా ప్రైవేట్ స్కూల్‌ల్లో సీట్లు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజులు చెల్లించాలని వేధిస్తున్నారన్నారు. అలాగే స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫారం, షూ కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టీఈ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు సత్తార్, రామాంజనేయులు, రాందాస్, బాష, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలకు బ్రేక్

అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడే సంజీవని లాంటి అంబులెన్స్ సేవలకు బ్రేకులు పడ్డాయి. గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యం, పాలకుల బాధ్యతారాహిత్యం కారణంగా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ వాహనాన్ని మూలనపెట్టేశారు. అంబులెన్స్ వినియోగంలో లేని కారణంగా వివిధ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడే క్షతగాత్రులతో పాటు ఆపదలో ఉన్న రోగులు, గర్భిణులను అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్యసేవల కోసం కర్నూలు, బళ్లారి ఆస్పత్రులకు తరలించాలంటే ప్రైవేట్ అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రజల అవసరాన్ని అవకాశంగా తీసుకునే ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు అందినకాడికి దోచుకుంటున్నారు. 108 అంబులెన్స్ ఉన్నా అనంతపురం జీజీహెచ్ వరకూ రోగులకు తరలించడానికి అనుమతి ఉంది. అదే సమయంలో ఆ వాహనానికి వేరే కేసులుంటే ఇక అంతే సంగతులు. ఈ విషయాలన్నీ పాలకులు, అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.



గుంతకల్లు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్

- మరమ్మతులు చేయించలేక.. మూలన పెట్టేశారు
- వినియోగంలోకి తేవాలని కలెక్టర్ ఆదేశించినా.. చర్యలు శూన్యం
- అత్యవసర వేళ.. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న రోగులు

గుంతకల్లుటౌన్: ఆస్పత్రి అంబులెన్స్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 150 పడకలు కలిగిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్లతో పాటు రోజూ 600 నుంచి 700 మంది వరకు ఔట్ పేషెంట్లు వైద్యసేవలు పొందుతుంటారు. గుంతకల్లు పట్టణ, మండలంతో పాటు వజ్రకరూర్, విడపనకల్లు, కర్నూల్ జిల్లా చిప్పగిరి, మద్దికెర మండలాలకు చెందిన ప్రజలకు ఇదే పెద్దాస్పత్రి. కరోనా లాంటి విపత్కర సమయాల్లో కోవిడ్ పాజిటివ్ పేషెంట్లను జిల్లా ఆస్పత్రులకు తరలించాలంటే ప్రైవేట్ అంబులెన్స్ నిర్వాహకులు వేలకు వేలు డబ్బులు వసూలు చేశారు. అసలే ప్రాణాపాయాలతో కొట్టుమిట్టాడుతూ ఆర్థికభారంతో బాధపడుతున్న ప్రజల కష్టాలను చూసిన అప్పటి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తన సొంత ఖర్చులతో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన రెండు అంబులెన్స్‌లను కొనుగోలు చేసి గుంతకల్లుకు ఒకటి, గుత్తి, పామిడి ఆస్పత్రులకు కలిపి మరొకటి అప్పగించి వైఎస్సార్-వైవీఆర్ ఉచిత అంబులెన్స్ సేవలను కొనసాగించారు. అయితే కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో గుంతకల్లు ఆస్పత్రికి అదనంగా మరో అంబులెన్స్‌ను కేటాయించాలని అప్పటి సీఎం వైఎస్.జగన్‌ను వైవీఆర్ కోరారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పరిమళ్ నత్వానీ ఎంపీ ల్యాడ్స్‌తో కొనుగోలు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌ను ఈ ఆస్పత్రికి కేటాయించారు. అప్పట్లో ఈ రెండు అంబులెన్స్‌లు మంచి సేవలందించాయి. కానీ కొన్ని నెలలుగా అంబులెన్స్‌కు డ్రైవర్ లేకపోవడం, రిపేర్లు చేయించకపోవడంతో ఆ అంబులెన్స్‌ను మూలనపెట్టేశారు. ఇప్పటికైనా అంబులెన్స్‌కు రిపేర్లు చేయించి దానిని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

మే 28న రాత్రి 10.30 గంటల సమయంలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మెడలో టవల్, ముఖానికి మాస్క్ ధరించి సామాన్య వ్యక్తిలా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ వద్దకు వెళ్లిన కలెక్టర్ తమ బంధువులను అనంతపురానికి తరలించాలంటే ఎంత ఖర్చవుతుందని ఆరాతీయగా ఆక్సిజన్‌తో అయితే రూ.5,500, ఆక్సిజన్ లేకుండా అయితే రూ.5 వేలు తీసుకుంటానని డ్రైవర్ తెలిపారు. దీంతో మరుసటి దినం డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌రవి కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్ అజేంద్ర రావును కలెక్టరేట్‌కు పిలిపించుకుని ప్రైవేట్ అంబులెన్స్‌ను ఆస్పత్రిలో పార్కింగ్ చేయించడంపై పట్ల అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌కు రిపేరీ చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. అయినప్పటికీ నేటివరకు ఆస్పత్రి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు.

అంబులెన్స్ వినియోగానికి చర్యలు తీసుకుంటాం



ఆస్పత్రి ఆవరణలో మూలనపెట్టిన అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించి, వినియోగించాలని కలెక్టర్ చెప్పిన మాట వాస్తవమే. అయితే అంబులెన్స్‌కు టైర్లు మార్చడంతో పాటు చాలా మరమ్మత్తులు చేయించాలి. మరమ్మత్తులకు ఎంత ఖర్చవుతుందో మొత్తం అంచనాలు తయారు చేయించాం. పైగా అంబులెన్స్‌కు డీజిల్ కేటాయింపు, డ్రైవర్ ఏర్పాటు ఎలా చేయాలన్న విషయమై త్వరలోనే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ అజేంద్రరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్, గుంతకల్లు

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలి

బుక్కరాయసముద్రం/గుంతకల్లు రూరల్/పామిడి: రైతులు పంటల సాగు చేసే సమయంలో ముందుగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రవి సూచించారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండలంలోని వడియంపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రైతులు ముందస్తుగా కలుపు నివారణ కోసం భూమిని బాగా దుక్కి చేసుకోవాలన్నారు. పంటల సాగు చేసే సమయంలో రైతులు విత్తనాన్ని శుద్ధి చేసుకోవాలన్నారు ఈ వారంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడతగా రూ.7 వేలు రైతుల ఆకౌంట్లలో జమ అవుతాయన్నారు. ఇందుకు రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి చౌడేశ్వరి, సర్పంచ్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



బీకేఎస్ మండలం వడియం పేటలో మాట్లాడుతున్న ఏడీఏ రవి

- గుంతకల్లు మండలంలోని కసాపురం, గుంతకల్లు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి లీనా వసుంధర వేరుశనగ పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. అలాగే మండల వ్యాప్తంగా 291 మంది రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.
- పామిడి మండలంలోని వంకరాజుకాలువ, నెమళ్లపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఏఓ విజయ్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నృత్య విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

తాడిపత్రిటౌన్: స్థానిక సంజీవనగర్‌లోని వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులను కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం అభినందించారు. మే 9న ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని తుంగనాథ్ దేవాలయం వద్ద -3 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలో భరతనాట్య ప్రదర్శనకు 13 మంది అకాడమీ విద్యార్థులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రత్యేక ఆహ్వానం మేరకు కలెక్టరేట్‌కు వెళ్లిన అకాడమీ విద్యార్థులు, నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు.



వందన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో మూడు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు రీ నోటిఫికేషన్ విడుదల చేశారని ఎక్సైజ్ సీఐ జి.నాయుడు మంగళవారం తెలిపారు. పట్టణంలోని జీ.ఎస్ఎల్ నెంబర్ 89, 93, 100 షాపులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈనెల 19లోపు రూ.రెండు లక్షల నాన్ రీఫండబుల్ సొమ్ముతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా జిల్లాలోని 10 ఎక్సైజ్ స్టేషన్లలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. చివరి రోజు సాయంత్రం 5గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో మద్యం షాపులు కేటాయిస్తామన్నారు.

అప్పు చెల్లించాలని వ్యక్తిపై దాడి

యల్లనూరు: తీసుకున్న అప్పు చెల్లించడలేదని ఓ వ్యక్తిపై దాడి చేశారు. వివరాలు.. మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి, గణేష్ నాయుడు అలియాస్ కరుణకు రూ.30 వేలు బాకీ ఉన్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం అప్పు చెల్లించాలని గణేష్‌నాయుడు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గొడవ చోటుచేసుకుని శేఖర్‌పై గణేష్‌నాయుడు విచక్షరహితంగా దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ సత్యబాబు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. మంగళవారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసు, సీఐ సత్యబాబు కలిసి గ్రామానికి వెళ్లి సాక్షులను విచారించారు. అనంతరం నిందితులు గణేష్ నాయుడు, హరీష్‌నాయుడు, గంగన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


గర్భిణికి మందుల అందజేత



గర్భిణి నీరజతో మాట్లాడుతున్న ఏఎన్ఎం విజయలక్ష్మి

తాడిపత్రి రూరల్: ఆధార్ కార్డు లేదన్న కారణంగా ఐదు నెలల గర్భిణికి వైద్య పరీక్షలు నిరాకరించిన వైనంపై 'ఆస్పత్రిలో టీకా లేదు – పౌష్టికాహారం ఇవ్వరు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై చుక్కలూరు పీహెచ్‌సీ వైద్యులు స్పందించారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నెకు ఏఎన్ఎం విజయలక్ష్మిని పంపి బాధిత గర్భిణి నీరజతో మాట్లాడించారు. అవసరమైన మందులను అందజేశారు. ఇకపై క్రమం తప్పని వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు, సలహాలను అందజేస్తామని భరోసానిచ్చారు.

నిర్మాణానికి మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్..

రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ సిస్టంకు మరమ్మతు చేసిన దృశ్యం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ కింద రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టంను నాసిరకంగా నిర్మించారని ఈనెల 13న పూర్తి కాకనే పగుళ్లు అన్న సాక్షి కథనంకు అధికారులు స్పందించారు. మంగళవారం హార్వెస్టింగ్ సిస్టంకు మరమత్తులు నిర్వహించారు. దీంతో 'సాక్షి'కి పలువురు అభినందనలు తెలిపారు.

ఇసుక అక్రమ తరలింపు అడ్డుకోండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు, రైతులు

అనంతపురం అర్బన్/శింగనమల: పెన్నా నది పరివాహక ప్రాంతం నుంచి భారీ స్థాయిలో జరుగుతున్న ఇసుక అక్రమ తరలింపులను అడ్డుకోవాలని పెన్నా పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. రాత్రి సమయాల్లో వందల సంఖ్యలో ట్రక్కుల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తరలింపు అరికట్టాలంటూ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, ఇతర నాయకులు మాట్లాడారు. శింగనమల, పెద్దవడుగూరు, గార్లదిన్నె మండలాల పరిధిలోని పెన్నా నది పరివాహక ప్రాంతంలోని రాచేపల్లి, నిదనవాడ, తరిమెల, గోపురాజుపల్లి, చిత్రచేడు, కల్లమడి, ఇల్లూరు గ్రామాలకు సాగు, తాగునీరు అందుతోందన్నారు. ఇసుక మేటల తొలగింపు పేరుతో పెన్నానది మధ్యలో నుంచి రాత్రి వేళ్లలో అక్రమంగా వందల సంఖ్యలో ట్రక్కుల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తునారన్నారు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే పెన్నా పరివాహక ప్రాంతంలో బోర్లు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసేందుకు నాయకులు ప్రయత్నిస్తే కలెక్టర్ ప్రెస్‌క్లబ్ వద్ద ఓ కార్యక్రమంలో ఉన్నారని తెలుసుకుని అక్కడకు వెళ్లి ఆయనకు వినతి పత్రం అందజేసి పరిస్థితి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, సీపీఎం, సీపీఐ అనుబంధ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, పెన్నా పరివాహక ప్రాంత రైతులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరంగయ్య, చిరుతల మల్లికార్జున, చిన్నప్పయాదవ్, భాస్కర్, తరిమెల భాస్కర్‌రెడ్డి, రమణ, సుధీర్, రంగారెడ్డి, సంగప్ప, నారాయణరెడ్డి, సత్యనారాయణ, గోవర్ధన్, కోటి, బాలిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శుభకార్యం

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఉన్న రజాక్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం ట్రాక్టర్ మెకానిక్ జిలాన్ తమ్ముడు మహమ్మద్‌రఫీ వివాహ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షు రాలు వై నైరుతిరెడ్డి హాజరైయ్యారు. ఈసందర్భంగా ఆమె వధూవరులను ఆశీర్వదించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రూరల్ మాజీ కన్వీనర్ నారాయణరెడి ఉన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన

పెద్దవడుగూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉండాలని ఎంఈఓ-2 గురుప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మంపల్లి, పెద్దవడుగూరు గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సులభమైన పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

పామిడి: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీ లింగమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పామిడిలో నిర్వహించిన పెద్దమ్మ దేవర ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని సకాలంలో వర్షాలు కురిసేలా అమ్మవారిని ప్రార్థించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు సుంకన్న, శ్రీరాములు, కొత్తరాయుడు, నరసింహులు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలు పూడ్చితే కఠినచర్యలు

గార్లదిన్నె: గ్రామాల్లో పంట కాలువలు పూడ్చితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఈరమ్మ హెచ్చరించారు. మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలసి ఆమె కల్లూరులో పెన్నానది సమీపంలో టీడీపీ నాయకులు కొండ చుట్టూ మట్టిని తవ్వి పంట కాలువ పూడ్చి మట్టి రోడ్డు వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పూడ్చిన పంట కాలువను జేసీబీతో తొలగించి, కాలువ ఏర్పాటు చేశామన్నారు.

'అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం'

గుంతకల్లు: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా వృద్ధాప్య ఫించన్, దీపం పథకం, తల్లివందన పథకాలు అమలు చేశామన్నారు. అనంతరం ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన టీఆర్ దీక్షిత్‌ను ఎమ్మెల్యే శాలవాతో సన్మానించి తల్లిదండ్రులు మస్తాన్‌రావు, దివ్యను అభినందిచారు. అంతక ముందు పట్టణంలోని ఎస్‌జేపీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జయరాం చేతులు మీదుగా దివ్యాంగులు, వయో వృద్ధులకు కృత్రిమ అవయవాల పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, గుజారి ఖాజా, లాయర్‌ప్రతాప్, కృష్ణారెడ్డి, మస్తానప్ప, ఆంజి, శివన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు శింగనమలలో యోగాంధ్ర

శింగనమల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శేషారెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి హాజరవుతారన్నారు. మండల అధికారులు, మహిళా సంఘ సభ్యులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు.

డీటీగా సూర్యనారాయణ



గుత్తి రూరల్: గుత్తి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంకే.సూర్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీటీ లలిత అనంతపురం హెచ్ఎల్‌సీ డీటీగా బదిలీ అయ్యారు. దీంతో గుత్తి సీఎస్‌డీటీగా ఉన్న సూర్యనారాయణను రెగ్యులర్ డీటీగా ఇక్కడే నియమించారు. డీటీ ముందుగా తహసీల్దార్ ఓబులేసును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు స్వీకరించిన డీటీని వీఆర్‌ఏలు పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ప్రశష్ట కుమారి



గుత్తి: గుత్తి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ప్రశష్ట కుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న నీలా ఉషా యాడికికి బదిలీ అయ్యారు. ఉరవకొండలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ప్రశష్ట కుమారిని ఇక్కడి బదిలీ చేశారు. బదిలీపై వెళ్తున్న నీలా ఉషాకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు.

రీసర్వే డీటీగా సురేఖ



పామిడి: పామిడి మండలం రీసర్వే డీటీగా సురేఖ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ రీసర్వే డీటీగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ యాడికికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బెళుగుప్ప మండలం నుంచి సురేఖ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

19న మండల సమావేశం

పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

తహసీల్దార్‌ను కలసిన వీఆర్‌ఏలు

శింగనమల: మండల తహసీల్దార్‌గా శేషారెడ్డి బాధ్యతలు తీసుకోవడంతో మంగళవారం మండలంలోని వీఆర్‌ఏలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకరావాలని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు ఓబిలేసు, వీఆర్‌ఏలు ధనుంజయ, శ్రీనివాసులు, రామాంజినేయులు, ఖాజాబీ, నాగరత్న, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

యువతి మృతి



గ్రీష్మ (ఫైల్)

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండకు చెందిన ఓ యువతి చికిత్స పొందుతూ మృతిచెందింది. జమేదార్ నరేష్ తెలిపిన వివరాలు మేరకు,, గ్రామానికి చెందిన సత్యనారాయణ కుమార్తె గ్రీష్మ (18) ఇటీవల గార్లదిన్నె మోడల్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న నయం కాకపోవడంతో ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉండగా ఆమెను కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.